# త్వరలో 'గౌరవెల్లి' కుడికాల్వ పనులు

- సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్
- గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద కుడి కాల్వ పరిశీలన



అక్కన్నపేట: గౌరవెల్లిలోని నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

అక్కన్నపేట, డిసెంబర్ 19 : మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టు ప్రధాన కుడి కాల్వ పనులను త్వరలో చేపడుతామని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద కుడి కాల్వను ఆమె పరిశీలించారు. అనంతరం గౌరవెల్లిలోని నర్సరీ, ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. మండలంలోని అంతకపేటలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. కూలీ డబ్బులు బ్యాంకు, లేదా తపాలా కార్యాలయం ద్వారా ఎలా తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీలో కూలీల సంఖ్యను పెంచాలని అధికారులకు సూచించారు. ఈజీఎస్‌లో నిర్మించిన మట్టి రోడ్డును చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టు ప్రధాన కుడి కాల్వ పలు చోట్ల దెబ్బతినడంతో పాటు మట్టితో కూరుకుపోయిందన్నారు. చెత్తాచెదారం పేరుకుపోవడంతో కాల్వలో పిచ్చి మొక్కలు, కాల్వ గట్లపైన ముళ్లచెట్లు పెరిగాయన్నారు. ఉపాధిహామీ పనుల్లో భాగంగా సాధ్యమైనంత వరకు కూలీలతో కాల్వను శుభ్రం చేయించేందుకు చర్యలు చేపడుతామన్నారు. నర్సరీలో వివిధ రకాల పండ్లు, పూల మొక్కలను విరివిగా పెంచాలన్నారు. నర్సరీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత, విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్డీవో జయదేవ్, ఇరిగేషన్ ఈఈ రాములునాయక్, ఏపీడీ ఓబులేష్, డీఎల్‌పీవో భద్రయ్య, ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, ఏపీవో ప్రభాకర్ పాల్గొన్నారు.

# రోడ్డు మూసివేత సూచిక బోర్డు ఏర్పాటు



గూడాటిపల్లి రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

అక్కన్నపేట, డిసెంబర్ 19 : మండలంలోని గూడాటిపల్లి గ్రామం గౌరవెల్లి ప్రాజెక్ట్ ముంపునకు గురికావడంతో ఆ రోడ్డును నీటిపారుదల శాఖ అధికారులు మూసివేశారు. మంగళవారం గూడాటిపల్లికి వెళ్లే రోడ్డు మూలమలుపు వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇటీవల ఓ డీసీఎం, గతంలో ఓ లారీ గూగుల్ మ్యాప్ సాయంతో ప్రాజెక్ట్‌లోకి వెళ్లిన విషయం తెలిసిందే. దీనిని దృష్టిలో ఉంచుకొని అధికారులు భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా రామవరం నుంచి గూడాటిపల్లికి వెళ్లే పాత దారి గౌరవెల్లి రిజర్వాయర్ ముంపునకు గురైందని తెలియజేస్తూ సూచిక బోర్డు ఏర్పాటు చేశారు.

# లక్ష్యసాధనకు సహకరించాలి



పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నగేశ్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 19: ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు బ్యాంకర్లు సహకరించాలని సంగారెడ్డి జిల్లా డీఆర్వో నగేశ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బ్యాంకర్లు, సిద్ధిజిల్లాస్థాయి అధికారులతో రైతులకు రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల రుణాలు, రికవరీ, పీఎంజీపీపై రుణాలు, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖల పథకాలకు సంబంధించిన రుణ లక్ష్య పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాలకు సంబంధించి జిల్లాలో రూ.7,800 కోట్ల రుణాలు అందించడం లక్ష్యం కాగా, ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు వివిధ బ్యాంకులు రూ.7,911.21 కోట్ల రుణాలు అందించినట్లు ఎల్‌డీఎం గోపాల్‌రెడ్డి తెలిపారు. అనంతరం నాబార్డుకు సంబంధించిన 2024-25 పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎల్‌డీఎం గోపాల్‌రెడ్డి, ఆర్‌బీఐ ఏజీఎం తాన్యా, నాబార్డు డీడీఎం కృష్ణ, డీఆర్డీవో శ్రీనివాసరావు, జడ్పీసీఈవో ఎల్లయ్య, మెప్మా పీడీ గీత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశం**



రాష్ట్ర అధ్యక్షుడు రాజేశాన్ని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

హుస్నాబాద్, డిసెంబర్ 19: విశ్వకర్మ కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేసి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారిని ఆదుకోవాలని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శివంపల్లి రాజేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సామాజికంగానే కాకుండా రాజకీయంగా విశ్వకర్మలు ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం హుస్నాబాద్‌లోని విశ్వకర్మ సంఘం కార్యాలయంలో జరిగిన విశ్వకర్మ కులస్తుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొందరు విశ్వకర్మలు ఇప్పటికీ నిరుపేదలుగానే జీవనం కొనసాగిస్తున్నారని, అటువంటి వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. విశ్వకర్మ వృత్తిలో ఉన్న వారికి ఉచిత విద్యుత్ అందించాలని, కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశ్వకర్మలు తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విశ్వకర్మ పరిషత్ మండలాధ్యక్షుడు ఎగ్గోజు సుదర్శనాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాలాచారి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ, శ్రీరాముల వేణు, నాయకులు శ్రీనివాస్, కుమారస్వామి, రవీందర్, భాస్కరాచారి, దామోదరాచారి, కనుకయ్య, రవి, నాగభూషణం, శ్రీకాంత్, శంకర్, జనార్దన్, రాజయ్య పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీలో పెండింగ్ పనుల పరిశీలన



పల్లెపహడ్ గ్రామస్తులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్‌అర్బన్, డిసెంబర్19: పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీలోని పల్లెపహడ్, ఎర్రవల్లి, వేములఘాట్, బంజరుపల్లి తదితర గ్రామాల్లో ఆయన పెండింగ్ పనులను పరిశీలించారు. గుట్టలు, రాళ్లు ఉన్న ప్రాంతంలో ప్లాట్లు కేటాయించిన వారికి వేరే ప్రాంతాల్లో ప్లాట్లు కేటాయించాలని సిద్దిపేట ఆర్డీవోకు సూచించారు. తొలిగించడానికి వీలున్న గుట్టలు, రాళ్లు వెంటనే తొలిగించి ప్లాట్లు చేసి కేటాయించిన వారికి అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆలయాలు, నీటి ట్యాంకులు, ఇతర నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఆయన వెంట గజ్వేల్, సిద్దిపేట ఆర్డీవోలు బన్సీలాల్, రమేశ్‌బాబు, తహసీల్దార్ బాలరాజు, టీఎస్‌డబ్ల్యూ ఐడీసీ ఈఈ శ్రీనివాస్, డీఈ మక్బూల్, మిషన్ భగీరథ డీఈ సుమలత, ఆర్ఐలు కృష్ణ, ప్రవీణ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు బాలకిషన్, రాజు, నాయకులు రాములు, సంధ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# ఊరికి మంచి పేరు తీసుకురావాలి

- జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ

చిన్నకోడూరు, డిసెంబర్ 19 : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలిచి తల్లిదండ్రులు, ఊరికి మంచి పేరు తీసుకురావాలని జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. చిన్నకోడూరు మండలం రామంచ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ సహకారంతో మంగళవారం ఆమె స్పోర్ట్స్ దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్రతినిధులు 73 మంది పాఠశాల విద్యార్థులకు రూ.73 వేల విలువ గల దుస్తులు అందజేయడం అభినందనీయమన్నారు. చదువుకుంటేనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కృషితో 'మన ఊరు – మన బడి'లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో తగిరెడ్డి దేశిరెడ్డి, సర్పంచ్ సంతోషి విక్రమ్, ఎంపీటీసీ వెంకటలక్ష్మియాదవరెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు గంప రమేశ్, ఎస్ఎంసీ చైర్మన్ రవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




రామంచ పాఠశాలలో విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు అందజేస్తున్న జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ

# జాన్ విల్సన్ సేవలు మరువలేనివి



జాన్ విల్సన్ చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగిస్తున్న చైర్‌పర్సన్ రజితావెంకట్



జాన్ విల్సన్ చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగిస్తున్న ఎస్సై మహేశ్

హుస్నాబాద్, డిసెంబర్ 19: జాన్ విల్సన్ చేసిన సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో దివంగత ఎస్సై జాన్ విల్సన్ విగ్రహం వద్ద జరిగిన వర్ధంతి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విగ్రహానికి పూలమాల వేసి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం హుస్నాబాద్‌కు ఎస్సైగా వచ్చిన జాన్ విల్సన్ ఇక్కడి యువతలో పెనుమార్పులు తీసుకొచ్చారన్నారు. యువతలో చైతన్యం కల్పించి ఉపాధి మార్గాలు చూపారని తెలిపారు. హుస్నాబాద్ పట్టణ ప్రజలు సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేశారన్నారు. కార్యక్రమంలో ఎస్సై తోట మహేశ్, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, జాన్ విల్సన్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు బోయి ని ఎల్లయ్య సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు




నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సురేందర్‌రెడ్డి

సిద్దిపేట రూరల్, డిసెంబర్ 19 : అంతర్ జిల్లా దొంగలను సిద్దిపేట రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఎస్సై కిరణ్ రెడ్డి సిబ్బందితో మండలంలోని పుల్లూరు ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులు ఎలాంటి నెంబర్ లేని హోండా అక్టివాపై తిరుగుతుండగా పట్టుకొని విచారించామని తెలిపారు. ఆరునెలల కింద సిద్దిపేట టౌన్ పరిధిలోని నాసర్‌పురాలో వృద్ధురాలి నుంచి మూడుతులాల బంగారు పుస్తెలతాడు, రెండునెలల కింద ముస్తాబాద్ మండలంలోని గూడెంలో మరో వృద్ధురాలి మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసు లాక్కొని ఎత్తుకెళ్లినట్లు పోలీసులు వెల్లడించారు. ఇటీవల రాఘవాపూర్ పరిధిలోని దగ్గుల ఆగవ్వ మెడలో నుంచి మూడు తులాల బంగారు పుస్తెలతాడు అపహరించారు. వీరు వినియోగిస్తున్న బైక్‌ను వేములవాడ దేవాలయం వద్ద నుంచి నిందితుడు కూరపాటి నరేశ్ దొంగిలించినట్లు తెలిపారు. వారిపై గతంలో పలు దొంగతనాల కేసులు నమోదయ్యాయని, నిందితులు మ్యాన శివ, కూరపాటి నరేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ సురేందర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో సీఐ వై.కృష్ణారెడ్డి, చేరాలు, సిద్దిపేట రూరల్ ఎస్సై కిరణ్‌రెడ్డి, కానిస్టేబుళ్లు రవిరాజు, రాజు, సిబ్బంది ఉన్నారు.